# అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్ట్

- 262 సిమ్‌లు, పరికరాలు స్వాధీనం..
- జన్నారం కేంద్రంగా నేరాలు
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా జన్నారం కేంద్రంగా వ్యవహరిస్తూ అంత ర్జాతీయ స్థాయిలో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబర్ భద్ర తా శాఖ, టెలికాం శాఖలతో కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నలుగురిని అరెస్టు చేసి, భారీ సంఖ్యలో సిమ్ కార్డులు, టెక్నికల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.డీసీపీ ఎగ్గడి భాస్కర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలానికి చెందిన బాపయ్య 2024లో కాంబోడియాకు వెళ్లి రెస్టారెంట్‌లో చేరాడు. అక్కడ కొత్తగూడెం జిల్లా వేదాంతపురానికి చెందిన సాయి కృష్ణ అలియాస్ జాక్‌తో పరిచయం ఏర్పడింది. జన్నారంలో అద్దె గది ఏర్పాటుకు బాపయ్యకు సూచించిన జాక్, ఆ పని కోసం బాపయ్య బావ రాజేశ్ సహకారాన్ని పొందాడు. అనంతరం మేలో జాక్ పంపించిన పరికరాలను బాపయ్య తమ్ముడు మధుకర్, బావ రాజేశ్‌లు జన్నారానికి తరలించారు. మరోవైపు ఏపీ పర్వతీ పురానికి చెందిన కామేశ్‌ను టెలిగ్రామ్‌లో సంప్రదించి నెలకు రూ.70 వేల వేతనానికి ముఠాలో చేర్చుకున్నాడు. లాభాల్లో వాటా ఇస్తానంటూ మోసం ప్రారంభించాడు. 262 ఫేక్ సిమ్‌లు సేకరించి వాటిని సిమ్ బాక్సుల్లో అమర్చి, వివిధ లింకులు రూపొందించి, విదేశీ నేరగాళ్ల సూచనల మేరకు అమాయకులకు పంపించి బ్యాంక్ డేటా దోచే ప్రయత్నం చేశారు. విచారణలో భాగంగా టెలికాం శాఖ (డాట్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కాల్ డేటా విశ్లేషించి, నలుగురిని గుర్తించారు. బాపయ్య, మధుకర్, రాజేశ్, కామేశ్‌లను అరెస్ట్ చేసి 262 సిమ్‌లు, ఐదు సిమ్ ప్యానెల్లు, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్ పరికరాలు, విద్యుత్ నిల్వ పరికరాలు, ద్విచక్రవాహనం, పలు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో జాతీయ, అంతర్జాతీయ లింకులు ఉన్నట్టు తేలిందని, పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. కేసు తాలూకు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన ఏసీపీ ప్రకాష్, డీఎస్పీ వెంకటరమణారెడ్డి, సీఐ రమణమూర్తి, డాట్ అధికారి అలెన్ అనురాగ్, ఇతర పోలీసు సిబ్బందిని అభినందించారు.

## రామగుండం ఎత్తిపోతల ప్రారంభానికి ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలి



**శెనార్తి మీడియా, గోదావరిఖని**

అంతర్గాం మండలంలోని ముర్మూరు ప్రాంతంలో ఆయకట్టు భూములకు నీరందించేందుకు నిర్మించిన రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలోని క్రీడా ప్రాంగణం, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సారెస్పీ కాల్వల 17ఎల్, 27ఎల్ క్రింద పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని 13,386 ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందించేందుకు ఈ ఎత్తిపోతల పథకం నిర్మించామని తెలిపారు. ఈ పథకాన్ని ఆగస్టు 3న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారని, అదేరోజు రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఎల్లంపల్లి ఈఈ స్వామి, తహసిల్దారులు రవీందర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మి కుటుంబానికి భరోసాగా వైద్య సిబ్బంది



**శెనార్తి మీడియా,శంకరపట్నం**

రాజాపూర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త భాగ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. తమతో కలిసి పనిచేసిన సహచరిని కోల్పోయిన విషాదంలో ఆశా కార్యకర్తలు, శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మనసు కరిగింది.భాగ్యలక్ష్మి కుటుంబానికి కొంత భరోసాగా నిలవాలని, ఆపదలో అండగా ఉండాలని వారు నిర్ణయించారు. వైద్యాధికారి ఆధ్వర్యంలో మొత్తం ₹51,500 విరాళంగా సమకూర్చి, ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.ఒక ఆశా కార్యకర్తగా గ్రామ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన భాగ్యలక్ష్మి సేవలను గుర్తు చేసుకుంటూ.. ఆమె కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యతను తమదిగా భావించారు. ఈ ఉదంతం ఆశాల మధ్య సానుభూతి, సోదరభావాన్ని చాటిచెప్పింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు


- 12 మందికి జరిమానా, పోలీసుల హెచ్చరిక

**శెనార్తి మీడియా,శంకరపట్నం**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 12 మందిని హుజురాబాద్ సెకండ్ క్లాస్ స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, వారికి కలిపి రూ.15,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, ఇది వారి ప్రాణాలు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకూ ప్రమాదకరమని తెలిపారు. అలాగే వాహనదారులు తమ వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని సూచించారు.కేసుల విచారణ అనంతరం మాట్లాడిన కేశవపట్నం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి చర్యలు నివారించేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి సహకరించాలని కోరారు.

# సహస్ర మరణంపై వెలువెత్తిన ఆగ్రహం





**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల బైపాస్ రోడ్డులో నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న మిమ్స్ జూనియర్ కళాశాల మూడో అంతస్తు నుంచి పడి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సహస్ర మృతిచెందిన ఘటనపై ఆగ్రహం వెల్లువెత్తింది. విద్యార్థి సంఘాలు, కుటుంబ సభ్యులు ఐబి చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులే లేకుండా భవనం నడుపుతూ విద్యార్థుల ప్రాణాలను తాకట్టు పెడుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు కోరారు. మృతురాలు కొత్తపల్లి సహస్ర లక్షెట్టిపేట్ మండలం కొత్తూరు గ్రామానికి చెందినది. బైపిసి చదువుతోన్న ఆమె కళాశాల మూడో అంతస్తు నుంచి కంపౌండ్ గోడపై పడి గాయాలపాలైంది. ప్రైవేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కళాశాల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించాయి.

## బాట బాగు చేయించిన మాజీ సర్పంచ్



- పాడైపోయిన రహదారిని చూసి చలించిన గట్టు తిరుపతి గౌడ్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కాచాపూర్, రాజాపూర్ గ్రామాల మధ్య రహదారి గుంతలు పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ దారిలో ప్రయాణికుల ఇబ్బందులను స్వయంగా చూసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాచాపూర్ మాజీ సర్పంచ్ గట్టు తిరుపతిగౌడ్ చలించిపోయారు.

కన్నాపూర్ నుంచి రాజాపూర్ దాకా బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్థులు రవాణా సౌకర్యం లేక మరింత ఇబ్బందులు పడుతున్నారు ఈ సమస్య తిరుపతిగౌడ్ దృష్టికి వెళ్లగా వెంటనే స్పందించారు. తన సొంత ఖర్చులతో రహదారి మరమ్మతులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. బుధవారం ఉదయం నుంచే ఆయన పర్యవేక్షణలో రోడ్డుపై మట్టి వేయించి, గుంతలను పూడ్చి వేయించారు. దశాబ్దాలుగా ఎదురవుతోన్న సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించిందని ప్రజలు భావిస్తున్నారు. తిరుపతిగౌడ్ చూపిన మానవతా దృక్పథం, సేవా తత్పరతకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో తిరిగి బస్సులు నడవడం వల్ల ప్రజలకు రాకపోకలలో ఊరట లభిస్తుందని, ప్రభుత్వానికి ఎదురు చూసేందుకు అవసరం లేకుండా ఒక నాయకుడిగా తిరుపతిగౌడ్ ఉదాహరణగా నిలిచారని వారు అన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**శెనార్తి మీడియా, భీమారం**

మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కాజీపల్లి, భీమారం గ్రామాల్లో ఉన్న పలు ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రతి డీలరు తప్పనిసరిగా స్టాక్ బోర్డును దుకాణం ముందు ఉంచాలని తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. మండలానికి అవసరమైనంత యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. డీఏపీకు ప్రత్యామ్నాయంగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 20:20:0:13 లేదా 28:28:0 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించవచ్చని సూచించారు.

# చిన్నారుల అక్రమ రవాణాపై చైతన్యం

- అదిలాబాద్ రైల్వే స్టేషన్లో ష్యూర్ ఎన్జీఓ అవగాహన సదస్సు



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

బాలల అక్రమ రవాణా విషయంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు అదిలాబాద్ రైల్వే స్టేషన్లో ష్యూర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఇటీవల చిన్నారులను ఎత్తుకెళ్లి బిక్షాటనకు వాడటం, మాదక ద్రవ్యాల రవాణాకు ఉపయోగించడం, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండే బాలలను బలవంతంగా దోహదపడేలా చేయడం వంటి ఘటనలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పిల్లల పట్ల అక్రమాలు జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్నారుల భద్రత కోసం సమాజం మొత్తం కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ పద్మ, రైల్వే స్టేషన్ మాస్టర్ శియారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ వినోద్ పాటిల్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, ష్యూర్ ఎన్జీఓ ప్రతినిధి కె.వినోద్, సిబ్బంది కిరణ్, సౌజన్య, ఐసిపిసి సిబ్బంది కృష్ణవేణి, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది శ్రీకాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ష్యూర్ ఎన్జీఓ ప్రచార కరపత్రాలను విడుదల చేసి, రైల్వే బోగీలపై అవగాహన స్టిక్కర్లు కూడా అంటించారు.

# ఇందిరమ్మ కమిటీల జోక్యాన్ని నివారించాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాల్లో కాంగ్రెస్ నాయకుల జోక్యం నివారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఎంపీ డీఓ కృష్ణప్రసాద్‌కు బుధ వారం వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీల సాకుతో ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారులకు సంతకాలు లేని జిరాక్స్ ప్రతులు ఇచ్చి కాంగ్రెస్ నాయకులు తామే ఇండ్లు ఇస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా రని తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద కాంగ్రెస్ నాయకులు ముగ్గులు వేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇండ్ల నిర్మాణాల్లో అధికారులకే పూర్తిగా బాధ్యత అప్పగించాలని, లబ్ధిదారుల ఎంపిక, పర్యవేక్షణలో స్థానిక రాజకీ య జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా డబుల్ బెడ్ రూం పథకానికి వాటా చెల్లిస్తున్నందున ప్రొసీడింగ్ పత్రాల్లో ప్రధాని ఫోటో ముద్రించాలని కోరారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, అంతం రాజిరెడ్డి, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, మందాడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, సుదగోని సారయ్య, దాసరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

**శెనార్తి మీడియా,శంకరపట్నం:** మొలంగూర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని డీఐఓ డాక్టర్ సాజిదా గురువారం తనిఖీ చేశారు. ఉప కేం ద్రంలో వ్యాక్సినేషన్, డ్యూ, బెనిఫిషర్స్ లిస్టల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామం లోని ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించా లని ఏఎన్ఎం, ఆశాలను ఆదేశించారు.

